ట్రాన్స్ ఫార్మర్ కష్టాలు..!

- కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- మరమ్మతులకు తప్పని ఇబ్బందులు
- సకాలంలో స్పందించని విద్యుత్ సిబ్బంది
- రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి


వేంపేటలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు(ఫైల్) ఇన్‌సెట్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

ఇటీవల మెట్‌పల్లి మండలం వేంపేటలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయింది. ఈ విషయాన్ని రైతులు విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకుపోయారు. మూడు రోజులైన రైతుల సమస్యను పట్టించుకోని సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ ను మరమ్మతు చేయలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళన చేపడు తామని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు,సిబ్బంది వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేశారు.

కొన్ని రోజుల క్రితం మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. బాగు చేయించిన ట్రాన్స్‌ఫార్మర్ కొద్ది రోజులకే మరోసారి కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినట్లు రైతులు సిబ్బంది దృష్టికి తీసుకుపోయినప్పటికీ సరిగ్గా స్పందించలేదు.దీంతో ఆ విషయాన్ని రైతులు చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోగా మరమ్మతు చేయించారు.

మెట్‌పల్లి రూరల్: రైతులకు కరెంట్ కష్టాలు తప్పడంలేదు. వానాకాలం సీజన్ ప్రారంభం సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవడం రైతులకు ఇబ్బందిగా మారింది. నిత్యం ఏదో ఓ చోట ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్య తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటి బాగు కోసం రోజుల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మెట్‌పల్లి మండలంలో 15–20 రోజుల వ్యవధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యాయి. అయితే ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మరమ్మతు చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది.

మరమ్మతులకు తంటాలు..

అసలే సాగు ప్రారంభం సమయం,అందులో నారు మడులు వేసిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం తలనొప్పిగా మారింది. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్,వేంపేట గ్రామాల్లో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి వాటి మరమ్మతు విషయంలో రైతులు నానా తంటాలు పడ్డారు. సకాలంలో బాగు చేయాల్సిన సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో పలువురి రైతుల నారుమడులు ఎండిపోయాయి. కొందరు రైతులు వేరే రైతుల మోటార్ల సహాయంతో నారుమడులకు నీటిని అందించారు. ప్రస్తుత పరిస్థితిలో ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మతుకు గురవుతుండడంతో మరమ్మతులు త్వరగా పూర్తిచేస్తే పంట సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.

కాలిపోయిన భారం రైతులపైనే..

ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం తీరు ఒకలా ఉండగా, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లే విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారు.ఏదైనా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైతే దాన్ని విద్యుత్ శాఖకు చెందిన వాహనంలోనే మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లాలి. మరమ్మతు పూర్తయిన తర్వాత మళ్లీ తీసుకొని వచ్చి బిగించాలి. కానీ రైతుల ట్రాక్టర్లోను, ఇతర కిరాయి వాహనాల్లోను మరమ్మతు కేంద్రానికి ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నారు. దీంతో తమపై భారం పడుతోందని రైతులు చెబుతున్నారు.రూ.2 వేల నుంచి 3 వేల వరకు భారం పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

స్పందించని ఏఈ..

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల విషయంలో జరుగుతున్న జాప్యం,విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంపై మెట్‌పల్లి మండల విద్యుత్ ఏఈ అజయ్‌ను సంప్రదించగా ఆయన స్పందించలేదు.

క్లుప్తంగా

చెత్త సేకరణ డ్రైవర్లను బదిలీ చేయొద్దని వినతి


వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని 33 వార్డుల్లో చెత్త సేకరించే ఆటో డ్రైవర్లను అదే వార్డుల్లో కొనసాగించాలని, ఇతర వార్డులకు బదిలీ చేయవద్దని బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. బదిలీ చేయడం వల్ల కొత్త డ్రైవర్లకు సరైన అవగాహన ఉండదని, ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫహీం, మాజీ కౌన్సిలర్లు సజ్జు,పేర్ల సత్యం, నాయకులు మురళి, వాసిక్, ఆనంద్, చిత్తారి, అర్బాజ్, ఇమ్రాన్,ఉమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న స్వామి యాదవ్

రాయికల్: 24 ఏళ్ల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం డీఈవో రామును కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర శాఖ సహ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెజిటెడ్ హోదా కల్పించి ప్రాథమిక పాఠశాలల్లో హిందీ ప్రవేశపెట్టి తెలుగు, హిందీ భాషా పండితులను నియమించాలని, అదే విధంగా 60 శాతం పీఆర్సీ ప్రకటించి పెండింగ్ డీఏలు, బిల్లులు మంజూరు చేయించాలని కోరారు.

గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరందించాలి


వాటర్‌గ్రిడ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి అందించాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని డబ్బా వాటర్‌గ్రిడ్‌ను సందర్శించారు. వాటర్‌గ్రిడ్‌లో ఫిల్టర్ బెడ్‌లు ఏ విధంగా పనిచేస్తున్నాయి, స్వచ్ఛమైన నీరు ఎలా వస్తుంది అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా నిరంతరంగా సరాఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వాటర్‌గ్రిడ్ ఏఈ మల్లేశం, మెగా కంపెనీ ఇంజినీర్ ఇమ్రాన్, ఆర్‌ఐ రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి సూచికపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

కోరుట్ల రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు పంచాయతీ అభివృద్ధి సూచికపై ఎంపీడీవో రామకృష్ణ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలు అవార్డులు పొందేందుకు పూరించాల్సిన ప్రశ్నలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, ఏవో నాగమణి, ఏఎస్సై సత్తయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కులసంఘాల ప్రతినిధులు తహసీల్దార్ వినోద్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. గ్రామశివారులో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వినియోగిస్తున్న ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయించాలని కోరారు. సర్వే నెంబర్ 290లో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిని కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమిని సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


కోరుట్లలో బోనాల వేడుకల్లో చిన్నారులు


గొల్లపల్లె లో బోనాలతో విద్యార్థుల సందడి


మల్లాపూర్ మోడల్ స్కూల్‌లో..

ఘనంగా బోనాలు

ధర్మపురి/రాయికల్/గొల్లపల్లి/మేడిపల్లి/మల్యాల/వెల్గటూర్/బుగ్గారం/మల్లాపూర్: బోనాల వేడుకలను శనివారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం బోనాలు వైభవంగా నిర్వహించుకున్నారు. విద్యార్థినులు భక్తి శ్రద్ధలతో బోనాలను వండి ఊరేగింపుగా ఆలయాల వద్దకు వెళ్లి అమ్మవారికి బోనాలను, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారుల కోలాటాలు, పోతరాజు వేషాలు, పులి వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

గోసంరక్షణలో అందరూ పాలుపంచుకోవాలి


మాట్లాడుతున్న విహెచ్‌పీ నాయకులు

గొల్లపల్లి: గోసంరక్షణలో అందరూ పాలుపంచుకోవాలని విశ్వహిందూ పరిషత్ గోరక్ష తెలంగాణ ప్రాంత గోరక్ష ప్రముఖ్ ఇసంపెల్లి వెంకన్న అన్నారు. శనివారం గొల్లపల్లి రామాలయంలో నిర్వహించిన విశ్వహిందు పరిషత్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గోమాత 33 కోట్ల దేవతలకు నిలయమని, రాబోవు పండుగల్లో ముందుగా గోపూజ చేయాలని కోరారు. భారతదేశంలో 80 శాతం వ్యవసాయ ఆధారిత దేశమని, గోవు గోసంతతి అయిన ఎద్దులు లేకుండా వ్యవసాయం లేదన్నారు. ఆవుపేడతో ఎరువులు కీటక నియంత్రణలు తయారు చేసి అమృత తుల్యమైన పంటలు పండించవచ్చన్నారు. ఆహారం, ఐశ్వర్యము, ఆరోగ్యం, ఉండాలంటే మనం గోవుని పూజించడం, గోమాత రక్షణలో పాలుపంచుకోవాలని, గోశాల నిర్మాణాలు, గోగ్రాసము, గోదారిత వ్యవసాయం ప్రోత్సహించాలని కోరారు.

గోరింటాకు వేడుకలు


గోరింటాకు వేడుకల్లో చిన్నారులు

కోరుట్ల టౌన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం బోనాలు, గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు తుమ్మనపెల్లి సత్యనారాయణ, కరస్పాండెంట్ మనోజ్ కుమార్, ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, మహిళా అధ్యాపకులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సౌజన్య, సుజాత, జ్యోతి, రాణి, స్వప్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని హుస్సేన్‌నగర్ పాఠశాలలో శనివారం గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సందడి చేశారు.

జూనియర్ కళాశాలలో ప్రొజెక్టర్‌తో తరగతులు

రాయికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ రూపొందించిన ఇంజినీరింగ్, మెడికల్, సీఏ పరీక్షల శిక్షణ శిబిరాలను ఆన్‌లైన్ ద్వారా ప్రొజెక్టర్ సహకారంతో విద్యార్థులకు వివరించినట్లు ప్రిన్సిపల్ జిందం రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేసి 9 మందిని పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అయిలాపూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 9 మందిని పట్టుకుని వారి వద్ద రూ. 6500 నగదు, 9 సెల్ ఫోన్లు, 8 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ధర్మపురి: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఆకుల సాయన్న శనివారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుతాడు అదుపు తప్పి కింద పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మాక్ పోలింగ్

రాయికల్: పట్టణంలోని ప్రగతి పాఠశాలలో నో బ్యాగ్‌డే సందర్భంగా శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, స్పోర్ట్స్ కన్వీనర్ పదవుల కోసం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం బాలె శేఖర్, డైరెక్టర్ బాలె నిఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు శనివారం పొలంబాట పట్టారు. రైతులతో కలిసి వరి నాట్లు వేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎద్దండి ముత్యంరాజు, డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలి

సారంగాపూర్: మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతం చేసి, పూర్తి చేయాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. శనివారం మండలంలోని నాగునూర్ లో నర్సరీని పరిశీలించారు. వర్షాలు పడుతున్నందునా గుంతలు తీసి, దానికి అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని, ఇళ్లలో పెంచడానికి అందించే పూల మొక్కల పంపిణీపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2026–27 వచ్చే సంవత్సరానికి ఏర్పాటు చేస్తున్న నర్సరీని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపివో సలీం, పంచాయతీ కార్యదర్శి అరీఫ్, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ శంకర్‌రెడ్డి ఉన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి 2025–26 సంవత్సరానికి గాను దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా షెడ్యూల్ కులాల విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్ అందించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు ఆగస్టు 31 వరకు WWW. TELANGANA. EPASS.CGG. GOV. IN కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షలతో పాటు, వీసా ఇవ్వనున్నట్లు తెలిపారు.

తాట్లవాయిలో ఉద్రిక్తత


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్: మండలంలోని తాట్లవాయిలో శనివారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మాజీపేట గ్రామానికి చెందిన బెక్కం సాయి అనే వృద్ధుడు శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని మృతిచెందగా, ఈ ఘటనకు కారకుడైన తాట్లవాయికి చెందిన ఓ యువకుడి ఇంటి ముందు బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో ఆందోళనకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయులకు గ్రామస్తుల సన్మానం

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మార్గం రాజేంద్ర ప్రసాద్, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె పల్లెకూ కాంగ్రెస్ జెండా పండుగ


జెండా ఆవిష్కరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో శనివారం పల్లెపల్లెకు పార్టీ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి, వెంకన్న, సత్తన్న, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్, హనుమంతు పాల్గొన్నారు.



కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు వీలుగా నిర్మించిన భవనం అసంపూర్తిగా ఉంది. 8 ఏళ్ల క్రితం జిల్లా పరిషత్ నిధులతో ఈ భవనం పనులు ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా ఉంది. ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, సెల్ నం.: 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు బదిలీతో కూడిన ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని టీపీటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎస్) సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సభ్యత్వ నమోదును కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినందునా అందుకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు పెండింగులో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కూరగాయల చంద్రశేఖర్, మండల బాధ్యులు ఆసం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలటౌన్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో జగిత్యాల పట్టణ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. శుక్ర, శనివారాల్లో మెట్‌పల్లిలో జరిగిన అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు పి యశ్వంత్‌కుమార్, మోక్షిత్, మనీషా, ఎం రమ్య పలు క్రీడాంశాల్లో రాణించి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, హెచ్‌ఎం రామానుజన్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ పరామర్శ

మెట్‌పల్లి రూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ అల్లూరి సుజాత తండ్రి పాటుకూరి రాజారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వృద్ధులను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల: వయోవృద్ధులను నిరాదరిస్తున్న కుమారులపై సంరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవచ్చని ఆర్డీవో కార్యాలయ ఏవో రవికాంత్ అన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో నలుగురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. గొల్లపల్లి మండలం వెంగళాపూర్‌కు చెందిన లక్ష్మి, అదే మండలం నందిపల్లికి చెందిన రామవ్వ, పట్టణంలోని వంజరివాడకు చెందిన శారద, మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన మలయ్య తమ కుమారులు, కూతుళ్లు, కోడళ్లు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఆదరించాలని, లేనిచో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, పద్మజ పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: జగిత్యాల డిపో ఆర్టీసీ అద్దెబస్సుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంత్రి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా చుక్క వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా శీలం సంతోష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కాసం శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా వాల్గొండ సురేశ్, గౌరవాధ్యక్షులుగా సాగి రామారావు, గిరి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా ముకుంద కొంరయ్య, రాచకొండ కుమారస్వామి, వేముల మహేశ్, మాదాడి రాజారాకేష్‌రావు, కొలగాని మహేందర్ ఎన్నికయ్యారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కార్యవర్గం

జగిత్యాల: పాఠశాల విద్యాశాఖ ఫోరం నాన్ గెజిటెడ్ ఉద్యోగుల జగిత్యాల జిల్లా కార్యవర్గంను శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుగుణాకర్ రావు, కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా మల్లేశం, ఉపాధ్యక్షులుగా వంశీకృష్ణ, విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా రుక్మిణి, పబ్లిసిటీ సెక్రటరీగా సందీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనిఫ్ అలీ, కార్యవర్గ సభ్యులుగా సింధూజ, సుజాత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీఈవో రాము, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, పవన్‌బాబు, అహ్మద్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

జగిత్యాల: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ రమణ అన్నారు. శనివారం పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన ఎల్లారెడ్డికి రూ.60 వేలు, రమేశ్‌కు రూ.6500, అల్లీపూర్‌కు చెందిన సాయికుమార్‌కు రూ.9 వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రత్నాకర్‌రావు, ఆనందరావు, వొల్లం మల్లేశం, రాము, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలో శనివారం సమతబాద్ క్రిష్ణకు రూ. 28వేలు విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గం ఉపాధ్యక్షులు కోడిమ్యాల దీపక్ రాజ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లూరి సాగర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల, కల్లెడ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శనివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పొగళ్ల సంధ్యారాణి, గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన రాసర్ల రాజవ్వ అనే మహిళ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా శనివారం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.లక్ష బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ టెరిటరి మేనేజర్ రాజేందర్, రీజినల్ మేనేజర్ అనిల్, అడ్వైజర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అల్లెపు పూజ రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ కొండపల్కల కోటేశ్వర్‌రావు తెలిపారు. ఈనెల 22 నుంచి గద్వాల జిల్లా ఉత్తనూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పూజ పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పూజను శనివారం హెచ్‌ఎం సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల స్థాయి వాలీబాల్ పోటీలు

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే మండలస్థాయి వాలీబాల్ పోటీల్లో యువకులు పాల్గొనాలని బీర్‌పూర్ ఎస్సై రాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఈ పోటీల్లో ఎంపికైన టీంను సర్కిల్ స్థాయికి, ఆ తరువాత జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే యువకులు 8712525013 నంబర్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.